సాక్షి విశాఖపట్నం

బుధవారం । 21 । ఆగస్టు । 2024



డీసీఐలో చమురు దొంగలు

డ్రెడ్జింగ్ కార్పొరేషన్‌ను కొందరు అధికారులు, ఉద్యోగులు లాభాల నుంచి మళ్లీ నష్టాల్లోకి నెట్టేస్తున్నారు. 8లో



పెన్షన్ రూ.9 వేలకు పెంచాలి

సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు ఆందోళన చేపట్టారు. 8లో



ముందుకొచ్చిన సముద్రం

ఆర్.కె.బీచ్‌లో అలలు ఎగిసిపడ్డాయి. ఆటు పోట్ల కారణంగా 10 నుంచి 15 మీటర్ల మేర సముద్రం ముందుకొచ్చింది. 8లో

న్యూస్‌రీల్

అయోధ్య రాముడి వెండి ధనస్సుకు పూజలు



వెండి ధనస్సుకు పూజలు చేస్తున్న కమిటీ పెద్దలు, భక్తులు

ఎంవీపీకాలనీ: పెదవాల్తేరులోని శివాలయంలో మంగళవారం 14 కిలోల అయోధ్య రాముడి వెండి ధనస్సును భక్తుల దర్శనార్థం ప్రదర్శించారు. ఈ ధనస్సును అయోధ్య భాగ్య నగర్ సీతారామ సేవా ఫౌండేషన్ (హైదరాబాద్) భక్తుల సహకారంతో తయారు చేయించింది. హైదరాబాద్ నుంచి తీసుకువచ్చిన ఈ ధనస్సును శివాలయంలో ప్రదర్శించగా.. వేదపండితులు ప్రత్యేక పూజ లు నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు భక్తులు ఈ ధనస్సును దర్శించుకున్నారు. ఫౌండేషన్ ప్రతినిధి శ్రీనివాస్ మాట్లాడుతూ ఈ ధనస్సును దేశవ్యాప్తంగా ప్రదర్శించిన తర్వాత అయోధ్యలోని బాలరాముడి ఆలయానికి సమర్పించనున్నట్లు తెలిపారు.

జూనియర్ కాలేజీల్లో గెస్ట్ ఫ్యాకల్టీ కోసం దరఖాస్తులు

విశాఖ విద్య: జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో గెస్ట్ ఫ్యాకల్టీగా పనిచేసేందుకు అర్హత గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా వృత్తి విద్యాశాఖాధికారి బి.రాధ ఓ ప్రకటనలో తెలిపారు. భౌతిక శాస్త్రం, జువాలజీ, వృక్షశాస్త్రం, పౌరశాస్త్రం, ఇంగ్లిష్ సబ్జెక్టులకు ఒక్కొక్క పోస్టు, మ్యాథ్స్-3, అర్థశాస్త్రం-2 పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అదే విధంగా వృత్తి విద్యా కోర్సులైన ఓఏఎస్, ఓ అండ్ టీ, పీఎస్‌టీటీ, పీటీ, ఎంఅండ్ ఏటీ సబ్జెక్టులకు ఒక్కొక్క పోస్టు, సీఈటీ సబ్జెక్టు-2 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విశ్రాంత అధ్యాపకులు, స్కూల్ అసిస్టెంట్లు, పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 50 శాతం మార్కులకు పైగా సాధించిన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. అభ్యర్థులు గురువారం సాయంత్రం 5 గంటల్లోగా పిఠాపురం కాలనీలోని యూనియన్ బ్యాంకు ఎదురుగా ఉన్న డీవీఈవో కార్యాలయం/ ఆయా జూనియర్ కాలేజీల్లో దరఖాస్తులు సమర్పించాలని సూచించారు. ఖాళీల పూర్తి వివరాల కోసం జిల్లాలోని 10 జూనియర్ కాలేజీల్లో సంప్రదించవచ్చు.

నేడు ఏయూ పరిధిలో పరీక్షలు వాయిదా


విశాఖ సిటీ: ఆంధ్రా యూనివర్సిటీ పరిధిలో బుధవారం జరగాల్సిన యూజీ, పీజీ, ప్రొఫెషనల్ పరీక్షలు వాయిదా వేసినట్లు ఏయూ అడిషనల్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ జె.రత్నం ఓ ప్రకటనలో తెలిపారు. బుధవారం భారత్ బంద్ సందర్భంగా విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. మళ్లీ పరీక్ష తేదీని ఏయూ వెబ్‌సైట్ ద్వారా ప్రకటిస్తామని వెల్లడించారు. అలాగే బంద్ కారణంగా ఏయూ క్యాంపస్‌కు బుధవారం సెలవు ప్రకటించినట్లు రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.కిశోర్ తెలిపారు.

ముగ్గురు ఏసీపీల బదిలీ



విశాఖ సిటీ: నగరంలో ముగ్గురు ఏసీపీలకు బదిలీ జరిగింది. ఈ మేరకు రాష్ట్ర డీజీపీ ద్వారకా తిరుమల మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈస్ట్ ఏసీపీగా ఉన్న బి.ఎం.జయరాంప్రసాద్ గుంటూరుకు బదిలీ అయ్యారు. అలాగే సీసీఎస్‌కు అటాచ్‌మెంట్‌లో ఉన్న టి.ఎస్.ఆర్.కె.ప్రసాద్ అమలాపురానికి స్థాన చలనం కలిగించారు. ట్రాఫిక్ ఏసీపీ జి.రాజీవ్‌కుమార్ విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డీఎస్పీగా నియమితులయ్యారు. వీరి స్థానంలో కొత్తగా ఎవరిని నియమించలేదు.

హైదరాబాద్-కటక్ మధ్య స్పెషల్ రైలు



తాటిచెట్లపాలెం: ప్రయాణికుల సౌకర్యార్థం హైదరాబాద్-కటక్-హైదరాబాద్ (వయా దువ్వాడ) మధ్య ప్రత్యేక రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. హైదరాబాద్-కటక్(07165) స్పెషల్ మంగళవారాల్లో రాత్రి 8.10 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 9.07 గంటలకు బయలుదేరి అదే రోజు సాయంత్రం 5.45 గంటలకు కటక్ వెళ్తుంది. ఈ స్పెషల్ సెప్టెంబరు 17 వరకు నడుస్తుంది. కటక్-హైదరాబాద్(07166) స్పెషల్ బుధవారాల్లో రాత్రి 10.30 గంటలకు బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ చేరుకుంటుంది. అక్కడ నుంచి 7.37 గంటలకు బయలుదేరి అదే రోజు రాత్రి 9 గంటలకు హైదరాబాద్ వెళ్తుంది. ఈ స్పెషల్ సెప్టెంబర్ 18వ తేదీ వరకు నడుస్తుంది.

రీచ్ లేక.. బండి నడవక

నిలిచిపోయిన వెయ్యికి పైగా ఇసుక లారీలు



నగర శివారులో నిలిచిపోయిన ఇసుక లారీలు

- జిల్లాలోని నాలుగు వేల కుటుంబాలు అవస్థలు
- శ్రీకాకుళంలో ఇసుక రీచ్‌లు ఏర్పాటు చేయాలని డిమాండ్
- ప్రభుత్వ ఆదాయాన్ని కొల్లగొడుతున్న ఒడిశా ఇసుక లారీలు

సాక్షి, విశాఖపట్నం : జిల్లాలోని 1000కి పైగా ఇసుక లారీలు పార్కింగ్‌కే పరిమితమయ్యాయి. కూటమి ప్రభుత్వం జమానాలో నడుస్తున్న ఇసుక పాలసీయే ఇందుకు కారణం. జిల్లాలో రీచ్‌లు లేకపోవడం.. వేరే జిల్లాలో రీచ్‌లు కేటాయించకపోవడం.. ఇసుక నిల్వలు నిండుకోవడంతో అవస్థలు తప్పడం లేదు. ఒకవైపు నిర్మాణరంగం కుదేలవగా మరోవైపు ఇసుక రవాణాపై ఆధారపడి బతుకుతున్న 4 వేల కుటుంబాలు ఉపాధి అవకాశాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ కుటుంబాలు ప్రభుత్వం కరుణిస్తుందేమోనని ఆశగా ఎదురుచూస్తున్నాయి.

బాబు జమానాలో ఎప్పుడూ ఇసుక కష్టాలే..

చంద్రబాబు పరిపాలనలో ఇసుక కష్టాలు కొత్తేం కాదు. 2014–19 మధ్య కాలంలో టీడీపీ ప్రభుత్వం డ్వాక్రా మహిళలతో ఒకసారి, మీసేవ డీడీ పాలసీ ఒకసారి, డీఆర్‌డీఏ పరిధిలో ఒకసారి, ఆన్‌లైన్ బుకింగ్ ద్వారా మరోసారి.. ఇలా నాలుగు పాలసీలు ఫెయిల్ అవ్వడంతో ఉచిత ఇసుక పాలసీ పెట్టారు. ఈ పాలసీల ద్వారా లారీ యజమానులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. అదేవిధంగా 2014 కాలంలో ట్రాన్స్‌పోర్ట్ చార్జీలు కూడా వినియోగదారుడు ప్రభుత్వానికి చెల్లించేవాడు. రవాణాదారుడు మాత్రం ఆ బిల్లుల కోసం అధికారుల చుట్టూ ఏడాది పాటు కాళ్లరిగేలా తిరిగి తేగానీ బిల్లులు వచ్చేవి కాదు. ఇప్పుడూ అదే పరిస్థితి కనిపిస్తోంది.

రోడ్డునపడ్డ 4 వేల కుటుంబాలు

విశాఖ జిల్లాలో అసోసియేషన్ పరిధిలో 1000 లారీలు ఇసుక రవాణా కోసం పనిచేస్తున్నాయి. ఇసుక రవాణా ద్వారా 4 వేల కుటుంబాలు ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. ఇసుక రవాణా లేకపోవడంతో ఈ లారీలన్నీ యార్డులకే పరిమితమైపోయాయి. దీంతో డ్రైవర్లు, క్లీనర్లకు ఉపాధి అవకాశాలు లేక అవస్థలు పడుతున్నారు.

నాణ్యమైన ఇసుక గగనమే..

నిర్మాణానికి మూడు రకాల ఇసుకను వినియోగిస్తుంటారు. ప్లాస్టరింగ్ కోసం మెత్తని ఇసుక, ఇటుకలతో గోడ కట్టేందుకు గరుకు ఇసుక, శ్లాబ్ కోసం ఎక్కువ గరుక ఉండే ఇసుక వాడతారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో ఇసుక రీచ్‌ల ద్వారా నేరుగా వినియోగదారుడికి కావల్సిన ఇసుక వచ్చేది. కానీ.. ప్రస్తుతం ఆన్‌లైన్‌లో పెట్టడం వల్ల మీసేవకు వెళ్లి ఇసుక బుక్ చేస్తే తనకు ఏ రకం ఇసుక కావాలో వినియోగదారుడు నమోదు చేసుకోలేకపోతున్నాడు. ఫలితంగా.. శ్లాబ్‌కు కావాల్సిన ఇసుక అడిగితే.. ప్లాస్టరింగ్‌కు అవసరమైన మెత్తని ఇసుక వస్తుండటం వల్ల వినియోగదారులు తీసుకోవడం లేదు. దీంతో లారీ డ్రైవర్లు వెనక్కి తీసుకురాలేక నానాయాతన పడుతున్నారు.

ప్రైవేట్‌కు అప్పగించిన తర్వాత..


గత వైఎస్సార్‌సీపీ హయాంలో తొలి రెండేళ్లు వివిధ రకాల పాలసీలతో ప్రజలు ఇబ్బంది పడ్డారు. ఏపీఎండీసీకి అప్పగించిన సమయంలో ఇసుక కోసం అటు ప్రజలు, ఇటు రవాణాదారులు అవస్థలు పడ్డారు. కానీ.. ప్రైవేట్‌కు అప్పగించాక ఇసుక లభ్యమవడం చాలా సులువైపోయింది. ప్రభుత్వం నిర్దేశించిన రేటు కంటే రవాణాదారులు తక్కువ రేటుకు విక్రయించారు. ప్రభుత్వం రూ.1100కి టన్ను ధర నిర్ణయిస్తే కొన్నిసార్లు రూ.800కే అందించిన దాఖలాలున్నాయి.

భీమిలి డిపో అవుట్ !

విశాఖ జిల్లా పరిధిలో భీమిలి, అగనంపూడిలో రెండు ఇసుక డిపోలు ఏర్పాటు చేశారు. టన్ను రూ.1076కు విక్రయించారు. భీమిలి డిపో ప్రారంభమైన నెల రోజులకే మూతపడిపోయింది. ఇసుక నిల్వలు లేకపోవడంతో మూసేశారు. దీంతో నిర్మాణదారులు అవస్థలు పడుతున్నారు.

అగనంపూడిలో లోకల్ దందా

భీమిలిలో ఇసుక డిపో మూతపడటంతో అగనంపూడి డిపో ఒక్కటే దిక్కవుతుంది. ప్రస్తుతం ఇక్కడ 200 లారీలు లైన్‌లో ఉంటున్నాయి. అయితే ఇక్కడ లోకల్ లారీ యజమానులు కుమ్మక్కై.. బయట నుంచి వచ్చే లారీలకు లోడ్ ఇచ్చేందుకు అవకాశం కల్పించడం లేదు. ఈ లోకల్ దందా కారణంగా 5 నుంచి 6 రోజుల పాటు లైన్‌లో ఉంటే ఒక లోడ్ దక్కుతోంది. ఈ కారణంగా అదనపు ఛార్జీలు పెరిగిపోతుండటంతో రవాణాదారులు తీవ్రంగా నష్టపోతున్నారు. ముందుగా లైన్‌లో ఉన్నా ఇతర ప్రాంతాల నుంచి వస్తున్న లారీల్ని వెనక్కి నెట్టేస్తున్నారు. స్థానిక లారీలకే అవకాశం కల్పిస్తున్నారు. ఈ విషయాన్ని పోలీసులకు, టీడీపీ ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోకపోవడం వల్ల లారీ డ్రైవర్లు, క్లీనర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.



అగనంపూడి డిపో వద్ద బారులు తీరిన లారీలు

ఐదు నెలలుగా ఇసుక రీచ్‌లు లేక

విశాఖ జిల్లాకు ఇసుక రీచ్‌లు లేవు. ఇక్కడి అవసరాల కోసం రాజమండ్రి, శ్రీకాకుళం జిల్లాల రీచ్‌లను కొన్నింటిని కేటాయిస్తుంటారు. అయితే ఎన్నికల సమయం నుంచి దాదాపు 5 నెలలుగా విశాఖ జిల్లాకు శ్రీకాకుళంలో ఒక్క రీచ్ కూడా కేటాయించలేదు. దీని వల్ల ఇసుక కొరత ఏర్పడినా ప్రభుత్వం స్పందించడం లేదు.

ఆదాయమంతా ఒడిశాకే...

దాదాపు 5 నెలల నుంచి ఇసుక ర్యాంపులు ప్రారంభించకపోవడంతో కొందరు పొరుగు రాష్ట్రాల నుంచి ఇసుక దిగుమతి చేసుకుంటున్నారు. ఒడిశా నుంచి విశాఖ నగరానికి రోజుకు 100కి పైగా ఇసుకలోడుతో వాహనాలు వస్తున్నాయి. పక్కా జీఎస్టీ బిల్లులతో వస్తుండటంతో చర్యలు తీసుకోలేకపోతున్నారు. దీంతో ఏపీకి రావల్సిన ఆదాయమంతా ఒడిశాకు వెళ్లిపోతోంది. శ్రీకాకుళంలో ఇసుక రీచ్‌లు ఓపెన్ అయితే ట్రాన్స్‌పోర్ట్ చార్జీలతో కలిపి టన్ను రూ.1000 నుంచి 1100కి దొరుకుతుంది. ప్రస్తుతం ఒడిశా నుంచి రూ.1700 నుంచి రూ.1900 వరకూ వసూలు చేస్తున్నారు. ఒడిశా మాదిరిగా జీఎస్టీ బిల్లులతో నడిపిస్తే ఎలాంటి ఇబ్బందులు ఉండవని రవాణాదారులు చెబుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు.

డీలక్స్ ప్యాకెట్లు అమ్ముకుంటున్నాను..



విశాఖ జిల్లా ప్రజలకు లారీ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులకు నేను చేస్తున్న విన్నపమిది. లంకెలపాలెం(అగనంపూడి)లో ఉన్న చంద్రన్న ఇసుక డిపోకి 5 రోజుల క్రితం వచ్చానండీ.. మా ఓనర్ ఇచ్చిన డబ్బులు అయిపోతే.. వేరే గత్యంతరం లేక ఈ డీలక్స్ ప్యాకెట్లు 10కి 3 చొప్పున అమ్ముకుంటున్నానండీ.. కనీసం మా డ్రైవర్లు కూడా సహకరించడం లేదు. ఇవాళ్టికి 4వ రోజు. రాత్రి తొమ్మిదో బండి కింద ఉన్న మా లారీ ఇప్పుడు 66కి వెళ్లిపోయింది. దీనిపై తక్షణమే చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలి. అయ్యా చంద్రబాబునాయుడు, గనుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర గారికి విజ్ఞప్తండీ. లారీ డ్రైవర్లమంతా ఇంటి దగ్గర భార్యా పిల్లల్ని వదిలేసి వచ్చేశాం. దయచేసి న్యాయం చేస్తారని మనవి చేసుకుంటున్నాను.

– సోషల్ మీడియాలోఓ లారీ డ్రైవర్ ఆవేదన

సమస్యను త్వరితగతిన పరిష్కరించాలి



ఇసుక రవాణా లేక లారీలన్నీ ఖాళీగా ఉన్నాయి. ఇదే పరిస్థితి ఇంకో నెల ఉంటే ఉత్తరాంధ్రలో లారీలు కనిపించవు. ఫైనాన్సర్లు డబ్బులు చెల్లించకపోతే లారీలు సీజ్ చేస్తామంటూ డెడ్‌లైన్ విధిస్తున్నారు. విశాఖ జిల్లాకు శ్రీకాకుళంలో 12 రీచ్‌లు త్వరితగతిన ప్రారంభించాలని ప్రభుత్వాన్ని కోరుకుంటున్నాం. సుమారు 10 వేల కుటుంబాలు దీనిపై ఆధారపడి బతుకుతున్నాయి. ప్రభుత్వం ఇసుక పాలసీపై 13 డిపార్ట్‌మెంట్‌లను ఇన్‌వాల్వ్ చేసింది. రీచ్‌లో వే బ్రిడ్జ్ పెట్టి 10, 12, 14, 16 టన్నుల లారీలకు.. టన్ను ధర రవాణా చార్జీలతో కలిపి వసూలు చేస్తే సులువవుతుంది. ఒడిశా మాదిరిగా జీఎస్టీ కూడా ఉంటే బాగుంటుంది. పక్కాగా ఇసుక రవాణా వ్యవహారాన్ని తేల్చాలని అసోసియేషన్ తరఫున కోరుతున్నాం.

– కర్రి రమణ, క్వారీ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధి

మరో నలుగురు చిన్నారులు రెస్క్యూ

- అనకాపల్లి నుంచి తీసుకువచ్చిన గాజువాక పోలీసులు
- శిశు కేంద్రానికి తరలింపు
- ఇప్పటికే కేంద్రంలో పాల డబ్బాలకు కూడా డబ్బులు లేవు..!
- తల్లిదండ్రులు లేకపోవడంతో గుక్కపెట్టి ఏడుస్తున్న పిల్లలు

విశాఖ సిటీ: శిశు విక్రయాల కేసులో పోలీసులు మరింత స్పీడ్ పెంచారు. మరో నలుగురు చిన్నారులను సురక్షితంగా విశాఖకు తీసుకువచ్చారు. ఇప్పటికే ఈ వ్యవహారంలో 17 మంది అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను పోలీసులు అరెస్టు చేసి ఆరుగురు చిన్నారులను రక్షించిన విషయం తెలిసిందే. ఈ ముఠా ఇప్పటికే 15 మంది శిశువులను విక్రయించినట్లు విచారణలో గుర్తించారు. దీంతో వీరిని రెస్క్యూ చేసేందుకు నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ప్రత్యేక బృందాలను అనకాపల్లి, ఢిల్లీ, ఇతర ప్రాంతాలకు పంపించారు. ఇందులో ఒక బృందం మంగళవారం నలుగురు చిన్నారులను అనకాపల్లిలో గుర్తించి సురక్షితంగా గాజువాక పోలీస్‌స్టేషన్‌కు తీసుకువచ్చినట్లు సమాచారం. వీరిని మర్రిపాలెం ప్రాంతంలో ఉన్న శిశు గృహానికి తరలించనున్నారు. మిగిలిన చిన్నారుల ఆచూకీ గుర్తించే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే దేశ వ్యాప్తంగా ఇతర రాష్ట్రాల్లో ఉన్న ఈ ముఠా సభ్యులపై కూడా ప్రత్యేక నిఘా పెట్టారు. పూర్తి స్థాయిలో ఈ గ్యాంగ్‌కు చెక్ పెట్టాలని గట్టి నిర్ణయంతో ఉన్నారు. ఇందులో కొన్ని ఆస్పత్రులు, వైద్యుల ప్రమేయంపై కూడా ఆరా తీస్తున్నారు. త్వరలోనే మరికొన్ని అరెస్టులు చూపించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

చిన్నారులతో నిండిపోయిన శిశు కేంద్రం

అంతర్రాష్ట్ర ముఠా విక్రయించిన శిశువులను తీసుకువచ్చిన పోలీసులు చిన్నారులను మర్రిపాలెం ప్రాంతంలో ఉన్న శిశు కేంద్రంలో ఉంచుతున్నారు. ఇప్పటికే ఆరుగురిని అక్కడ చేర్పించారు. అప్పటికే ఆ కేంద్రంలో కొంత మంది చిన్నారులు ఉన్నారు. వారికే ప్రస్తుతం పాల డబ్బాలకు కూడా డబ్బులు లేని పరిస్థితి ఉన్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రస్తుతం కొత్తగా తీసుకువచ్చిన చిన్నారులను మళ్లీ అదే కేంద్రంలో అప్పగిస్తే మరింత భారం పడే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఈ విషయాన్ని కేంద్రం సిబ్బంది పోలీసుల దృష్టికి తీసుకువెళ్లినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ప్రస్తుత పరిస్థితి దృష్ట్యా కొత్తగా చిన్నారులను ఈ కేంద్రానికి తీసుకు రావద్దని పోలీసులను కోరినట్లు తెలిసింది. దీనిపై పోలీసులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసే ఆలోచన ఉన్నారు. ఇదిలా ఉంటే రక్షించిన చిన్నారులు గుక్కపెట్టి ఏడుస్తుండడంతో వారిని సముదాయించడం అక్కడి సిబ్బంది వల్ల కావడం లేదు. నిన్న మొన్నటి వరకు పెంచిన తల్లిదండ్రుల వద్ద అలవాటు పడిన చిన్నారులు ఇప్పుడు కొత్త వ్యక్తుల మధ్య ఉండలేకపోతున్నారు. ఇప్పుడు వీరిని ఎలా సముదాయించి, తరువాత ఏం చేయాలన్న విషయంపై అధికారులు సైతం మల్లగుల్లాలు పడుతున్నారు.

డిజిటల్ బెగ్గర్

'మేమూ అప్డేట్ అయ్యాం. డిజిటలైజేషన్ దిశగా అడుగులు వేస్తున్నాం. నగదు రహిత పేమెంట్లు స్వీకరిస్తాం' అంటున్నారు బీచ్ రోడ్డులో యాచకులు. డిజిటల్ చెల్లింపులు పెరిగిపోవడంతో చాలా మంది తమ వద్ద డబ్బులు ఉంచుకోవడం లేదు. దీంతో బీచ్‌రోడ్డులో ఓ యాచకుడు వెరైటీగా ఓ స్కానర్‌ను పట్టుకుని తిరుగుతున్నాడు. ఎవరైనా డబ్బులు లేవంటే.. క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేసి డబ్బులు పంపించాలని అడుగుతున్నాడు. అతని అడిగే విధానానికి కొందరు అవాక్కవుతుంటే.. మరి కొందరు నవ్వుతూ స్కాన్ చేసి డబ్బులు పంపిస్తున్నారు.

ఫొటో: సాక్షి ఫొటోగ్రాఫర్



భారత నేవీకి నమ్మదగ్గ భాగస్వామి ఎన్‌ఎస్‌టీఎల్

- ఈస్టర్న్ నేవల్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్
- దేశంలోని ప్రీమియం ల్యాబ్‌లలో ఎన్‌ఎస్‌టీఎల్ ముందంజ
- ఘనంగా 55వ ల్యాబ్ రైజింగ్ డే



ప్రతిభ కనబరిచిన ఎన్‌ఎస్‌టీఎల్ ఉద్యోగికి జ్ఞాపికను అందిస్తున్న ఈఎన్‌సీ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్, వై.శ్రీనివాసరావు, అబ్రహం వర్గీస్ తదితరులు

గోపాలపట్నం: భారత నావికాదళంలో నమ్మకమైన భాగస్వామిగా ఎన్‌ఎస్‌టీఎల్ నిలిచిందని ఈస్టర్న్ నేవల్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ అన్నారు. ఎన్‌ఎస్‌టీఎల్ మానసి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించిన 55వ ల్యాబ్ రైజింగ్ డేలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాజెక్టులు సకాలంలో పూర్తి చేసేందుకు ఎన్‌ఎస్‌టీఎల్, భారత నేవీ సమన్వయంతో పనిచేస్తున్నాయన్నారు. ఇక్కడి ఉద్యోగులు, శాస్త్రవేత్తల అవిశ్రాంత కృషి, అంకితభావంతో ఎన్‌ఎస్‌టీఎల్ భారత నావికాదళానికి నమ్మకమైన భాగస్వామిగా మారిందని కొనియాడారు.

డీఆర్‌డీవో ఫ్యూచరిస్టిక్ టెక్నాలజీ మేనేజ్‌మెంట్ డైరెక్టర్(డీఎఫ్‌టీఎం) డాక్టర్ ఎన్.రంజన మాట్లాడుతూ ఆత్మనిర్భర భారత్, వికసిత భారత్–2047 సాకారం దిశగా డీఆర్‌డీవో చేస్తున్న కృషిని వివరించారు. విశిష్ట శాస్త్రవేత్త, నేవల్ సిస్టమ్స్ అండ్ మెటీరియల్స్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ వై.శ్రీనివాసరావు మాట్లాడుతూ అండర్ వాటర్ టార్గెట్ స్ట్రక్చర్(యూడబ్ల్యూటీఎస్) అమలు ద్వారా వరుణాస్త్ర టార్పిడో ట్రయల్స్ విజయవంతంగా పూర్తి చేశామన్నారు.

ఎన్‌ఎస్‌టీఎల్ డైరెక్టర్ డాక్టర్ అబ్రహం వర్గీస్ మాట్లాడుతూ 1969 ఆగస్టు 20న 10 మంది సిబ్బందితో ప్రారంభమైన ఎన్‌ఎస్‌టీఎల్ ఇప్పుడు 186 మంది శాస్త్రవేత్తలు సహా 603 మంది సిబ్బందితో విరాజిల్లోతోందన్నారు. అనంతరం సంస్థ వార్షిక నివేదిక, గత ఏడాది చేసిన సేవా కార్యక్రమాలను వివరించారు. పాతికేళ్లుగా సంస్థలో సేవలు అందిస్తున్న సిబ్బందిని సత్కరించారు. ఇన్‌ఫ్రారెడ్ స్టెల్త్‌పై కృషికిగాను నేవల్ చీఫ్ ఆఫ్ ఇంటిగ్రేటెడ్ డిఫెన్స్ స్టాఫ్ చైర్మన్, చీఫ్ ఆఫ్ కమిటీ(సీఐఎస్‌సీ) కెప్టెన్ డాక్టర్ ఏవీఎస్ఎన్ మూర్తికి ప్రశంసా పత్రాన్ని అందించారు.

ఈ సందర్భంగా డాక్టర్ వై.శ్రీనివాసరావు, డాక్టర్ అబ్రహం వర్గీస్, డాక్టర్ ఎన్.రంజన చేతుల మీదుగా అండర్ వాటర్ టార్గెట్ స్ట్రక్చర్ సాంకేతికతను మేనేజింగ్ డైరెక్టర్ వీఎన్‌వీ సత్యేంద్రకు బదిలీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు, అధికారులు, వర్క్స్ కమిటీ సెక్రటరీ బాల్మీకి పండిట్, ఎన్ఎస్‌టీఎల్ సివిల్ ఎంప్లాయీస్ యూనియన్ సభ్యులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

బదిలీల జీవోపై ఉద్యోగుల అసంతృప్తి

- గత ప్రభుత్వంలో 20 శాతం సీలింగ్‌తో బదిలీలు
- ప్రస్తుతం అందరినీ బదిలీ చేసే అవకాశం



మహారాణిపేట: బదిలీల జీవోపై ఉద్యోగులు అసంతృప్తితో ఉన్నారు. నగరంలో పనిచేసే వారందరినీ అనకాపల్లి, అల్లూరి జిల్లాలకు బదిలీ చేసే అవకాశం ఉండడంతో వారంతా రగిలిపోతున్నారు. గత ప్రభుత్వంలో 20 శాతం సీలింగ్‌తో ఐదేళ్లు ఒకేచోట పని చేస్తున్న వారి బదిలీలకు అనుమతి ఇచ్చారు. కానీ ప్రస్తుతం సీలింగ్ లేకపోవడంతో అందరినీ ఇక్కడి నుంచి బదిలీ చేసే అవకాశం ఉంటుందని ఉద్యోగులు అంటున్నారు. కొత్త జీవో ప్రకారం 14 శాఖల ఉన్నతాధికారులు ఐదేళ్లు ఒకే చోట పనిచేస్తున్న వారి జాబితాను సిద్ధం చేశారు. శతశాతం బదిలీలకు అవకాశం ఉండడంతో బదిలీల జాబితా చాంతాడంత ఉన్నట్లు తెలిసింది. కాగా.. ఈ ప్రక్రియలో సీలింగ్ ఎత్తివేసినప్పటికీ ఉద్యోగ సంఘాల నేతలు కినుక వహిస్తున్నారు.

సీలింగ్ లేకపోవడం ఇబ్బందే.. : బదిలీల ప్రక్రియలో సీలింగ్ ఎత్తేయడం వెనుక కూటమి ప్రభుత్వం కుటిల బుద్ధి బయటపడుతోంది. గత ప్రభుత్వంలో నగరంలో పనిచేసిన వారంతా వైఎస్సార్ సీపీకి అనుకూలంగా పనిచేశారన్న అభిప్రాయంతో కూటమి ప్రజాప్రతినిధులు ఉన్నారు. సీలింగ్ విధానంలో అయితే అందరినీ ఇక్కడి నుంచి పంపించే అవకాశం ఉండదు. సీలింగ్ ఎత్తేయడంతో ఇప్పుడు ప్రతి ఒక్కరినీ బదిలీ చేసే అవకాశం ఏర్పడింది. కొంత మందిని ఐదేళ్ల ప్రాతిపాదికన చూపించి మిగిలిన వారిని సాధారణంగానే స్థానచలనం కలిగించే అవకాశాలు కనిపిస్తున్నాయి.

జాబితాలు సిద్ధం

బదిలీల ప్రక్రియకు ఈ నెల 31వ తేదీ వరకు అవకాశముంది. ఈలోగా అన్ని శాఖల్లో బదిలీలు చేపట్టాల్సి ఉంది. సాధారణ ఎన్నికల తర్వాత ఈ బదిలీల ప్రక్రియ జూన్‌లోనే పూర్తయ్యేది. కానీ కూటమి ప్రభుత్వం మాత్రం ఆగస్టు వరకు ఈ విషయంపై దృష్టి పెట్టలేదు. గత ప్రభుత్వానికి అనుకూలంగా పనిచేశారన్న ఆరోపణలు ఉన్న వారి జాబితాను ఇప్పటికే స్థానిక నేతల నుంచి ప్రభుత్వ పెద్దలు రప్పించుకున్నారు. అలాగే ఇప్పటికే కొంత మంది ఉద్యోగులు జిల్లాలో ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణ చేస్తున్నారు. వారు సూచించిన వారికే పోస్టింగ్‌లు లభించే అవకాశాలు ఉన్నట్లు బహిరంగంగానే వార్తలు వినిపిస్తున్నాయి. ఇదిలా ఉంటే 14 ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు బదిలీల జాబితాను సిద్ధం చేశారు. ఇప్పటికే కొంత మంది ప్రజాప్రతినిధులు తమకు కావాల్సిన వారి పేర్లను ఆయా శాఖల అధికారులకు పంపించినట్లు విశ్వసనీయవర్గాల సమాచారం. ప్రభుత్వ పెద్దల నుంచి గ్రీన్‌సిగ్నల్ వచ్చిన వెంటనే త్వరలోనే అన్ని శాఖల్లో బదిలీల జాబితాను ప్రకటించే అవకాశముంది.

నిర్లక్ష్యంగా వాహనం నడిపిన ఒకరికి పదేళ్ల జైలు

విశాఖ లీగల్: వాహనాన్ని నిర్లక్ష్యంగా నడిపి ఒక వ్యక్తి మృతికి కారణమైన డ్రైవర్‌కు పదేళ్ల జైలు, రూ.20 లక్షలు జరిమానా విధిస్తూ నగరంలోని పదో అదనపు జిల్లా న్యాయమూర్తి ఎం. శ్రీవిద్య మంగళవారం తీర్పునిచ్చారు. జరిమానా సొమ్ముని మృతుని కుటుంబానికి ఇవ్వాలని న్యాయమూర్తి తమ తీర్పులో పేర్కొన్నారు. ప్రత్యేక పబ్లిక్ ప్రాసిక్యూటర్ బి. వెంకట్రావు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. నిందితుడు గాడి రామారావు (46) ఆనందపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని పద్మనాభం మండలం పాండ్రంకి గ్రామానికి చెందినవాడు. వృత్తిరీత్యా ఆటో డ్రైవరు. 2021 డిసెంబర్‌లో వెన్న శీను (32) తన ద్విచక్రవాహనంపై వస్తుండగా నిర్లక్ష్యంగా ఆటో నడిపిన రామారావు అతడ్ని ఢీకొట్టాడు. దీంతో శ్రీను మృతి చెందాడు. నిందితుడిపై ఆనందపురం పోలీసులు కేసు నమోదు చేశారు. నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పునిచ్చారు.

రాజమండ్రిలో కేసు.. పెదగంట్యాడలో గాలింపు


శ్రీనివాసరావు(ఫైల్)

పెదగంట్యాడ: నకిలీ నోట్ల మార్పిడి, దొంగ బంగారం విక్రయించడం, తదితర కేసుల్లో నిందితుడైన నమ్మి శ్రీనివాసరావు ఆచూకీ కోసం రాజమహేంద్రవరం పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. జీవీఎంసీ 77వ వార్డు పరిధిలోని అప్పికొండకు చెందిన నమ్మి శ్రీనివాసరావు పలు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. తూర్పుగోదావరి జిల్లాలో పలు నేరాలకు పాల్పడిన శ్రీనివాసరావును ఏ–2గా రాజమహేంద్రవరం ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి నిర్ధారిస్తూ తీర్పునిచ్చారు. నిందితుడిని పట్టుకోవాలని రాజమహేంద్రవరం–1 టౌన్ పోలీసులకు ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో అప్పికొండలో చాటింపు(దండోరా) వేయించారు. నిందితుడి ఫొటోతో ఉన్న పోస్టర్లను ప్రధాన సెంటర్లలో అతికించారు. అతని ఆచూకీ తెలిసిన వారు వెంటనే సమాచారం ఇవ్వాలని రాజమహేంద్రవరం –1 టౌన్ హెడ్ కానిస్టేబుళ్లు ఎస్‌వీ రమణ, సీహెచ్ శ్రీనివాస్ కోరారు.

డీసీఐలో చమురు దొంగలు

- వచ్చిన ఆదాయంలో 80 శాతం ఆయిల్ కోసమేనంటూ బిల్లులు
- అందుకే నష్టాల బాటలో డీసీఐ
- ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌కు చమురు బిల్లులు చెల్లిస్తున్న డీసీఐ
- బిల్లుల్లో 20 శాతం వరకూ అధికారుల సొంత ఖాతాల్లోకి
- డ్రెడ్జర్లు మరమ్మతుల్లో ఉన్నా బిల్లులు జమ చేస్తున్న వైనం
- తతంగమంతా నడిపిస్తున్న షాడో ఎండీ, ఓ ఎంసీవో


డ్రెడ్జర్లు

సాక్షి, విశాఖపట్నం: మూడేళ్ల క్రితం వరకూ నష్టాలతో కొట్టుమిట్టాడుతున్న డ్రెడ్జింగ్ కార్పొరేషన్.. కాస్తా ఊపిరి పోసుకుంటున్న సమయంలో.. కొందరు అధికారులు, ఉద్యోగులు మళ్లీ నష్టాల్లోకి నెట్టేస్తున్నారు. 2023–24 ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికంగా రూ.15కోట్లకు పైగా నికరలాభాల్ని ఆర్జించిన డీసీఐ.. ఈ ఏడాది తొలి త్రైమాసికాన్నే ఏకంగా రూ.31 కోట్ల నష్టాలతో ప్రారంభించింది. దీనికి కారణం కొందరు అధికారుల వ్యవహారశైలేననే ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి. అన్నం పెడుతున్న సంస్థకు కన్నం వేస్తున్నట్లుగా వ్యవహరిస్తూ.. అందినకాడికి దోచుకొని మూట కట్టుకుంది. దీంతో పాటు షేర్ విలువపై లాభాలు కాకుండా నష్టాల్లోకి నెట్టేశారు. ఆర్డర్లు దండిగా వస్తున్నా.. కొందరు అధికారుల స్వలాభం కారణంగా.. నష్టాల్ని చవిచూడాల్సి వచ్చిందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.

ఆదాయమంతా ఐవోసీఎల్‌కే..

ప్రస్తుతం డీసీఐకి 10 ప్రధానమైన డ్రెడ్జర్లున్నాయి. డ్రెడ్జింగ్‌లో ఉన్నప్పుడు ఒక రోజుకు 10 వేల నుంచి 20 వేల లీటర్ల వరకూ డీజిల్ వినియోగమవుతుంటుంది. ఈ చమురును సరఫరా చేసేందుకు ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐవోసీఎల్)తో ఒప్పందం చేసుకున్నారు. డ్రెడ్జర్ పనిలో ఉన్నప్పుడు రెండు ఇంజిన్లు ఆన్ చేస్తారు. అందుకే ఈ మేర డీజిల్ వినియోగమవుతుంటుంది. తవ్వకాలు జరగని సమయంలో కేవలం ఒకే ఒక ఇంజిన్ ఆన్ చెయ్యాల్సి ఉంటుంది. కానీ ఐవోసీఎల్‌కు ఆదాయాన్ని పెంచేందుకు రెండు ఇంజిన్లనూ ఆన్ చేసేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఈ కారణంగా చమురు బిల్లులు తడిసి మోపెడవుతున్నాయి. డ్రెడ్జింగ్ చేస్తే వచ్చే ఆదాయంలో 80 శాతం వరకూ ఐవోసీఎల్‌కే చెల్లింపులు జరుగుతున్నట్లు తెలుస్తోంది. రూ.10 కోట్లకు డ్రెడ్జింగ్‌కు ఒప్పందం కుదుర్చుకుంటే రూ.8 కోట్ల వరకూ చమురు బిల్లులకే చెల్లింపులు చేస్తున్నారు.

డ్రెడ్జర్లు మరమ్మతుల్లో ఉంటే ఆయిల్ ఎలా.?

ఇటీవల తొలి త్రైమాసిక ఫలితాలు విడుదల చేసినప్పుడు నష్టాలకు కారణం 6 వరకూ డ్రెడ్జర్లు మరమ్మతులకు గురయ్యాయంటూ కుంటి సాకులు చెప్పారు. అయినా చమురు బిల్లులు మాత్రం తగ్గడం లేదు. మరమ్మతుల్లో ఉన్న డ్రెడ్జర్లు కూడా పనిలో ఉన్నప్పుడు ఎంత ఆయిల్ వినియోగిస్తుంటాయో.. అంతే వినియోగం జరిగిందంటూ బిల్లులు నమోదు చేసినట్లు తెలుస్తోంది. రిపేర్లలో ఉన్న తవ్వోడలు చమురు ఎలా తాగేస్తున్నాయో తెలీదంటూ కొందరు అధికారులు తలలు పట్టుకుంటున్నారు. ఈ చమురు బిల్లులు చెల్లించేందుకు డబ్బులు లేక.. దాదాపు రూ.2 కోట్ల వరకూ ఐవోసీఎల్‌కు బకాయి పడినట్లు సమాచారం.

వారిద్దరే మాస్టర్ మైండ్స్.?

డీసీఐ చమురు బిల్లులు వెనుక కొందరు అధికారుల హస్తం ఉందని డీసీఐ ఉద్యోగులే ఆరోపిస్తున్నారు. షాడో ఎండీగా వ్యవహరిస్తున్న వ్యక్తితో పాటు గతంలో ఆరోపణలు ఎదుర్కొని సస్పెన్షన్‌కు గురైన ఎండీకి చెందిన మరో కీలక వ్యక్తి కలిసి ఈ చమురు వ్యవహారాన్ని నడిపిస్తున్నట్లు తెలుస్తోంది. 10 వేల లీటర్ల ఆయిల్ వినియోగం జరిగితే.. 15 వేల లీటర్లకు బిల్లులు పెట్టి.. వచ్చిన సొమ్ముని పంచుకుంటున్నట్లు సమాచారం. ఈ విధంగా దాదాపు కోటిన్నరకు పైగా ఆయిల్ బిల్లులు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారాలను కప్పిపుచ్చేందుకు ఓ ఎంసీవో స్థాయి ఉద్యోగి ఢిల్లీలో మకాం వేస్తూ నిత్యం ఇక్కడ జరిగే వ్యవహారాలను బయటకు రానివ్వకుండా మేనేజ్ చేస్తున్నట్లు సమాచారం. ఎంసీవో చేయాల్సిన విధులకు మంగళం పాడి.. తానే అంతా అయి నడిపిస్తున్నట్లుగా వ్యవహరిస్తున్నారని విమర్శలొస్తున్నాయి. తాము పెంచి పోషిస్తున్న డీసీఐలో ఇంత జరుగుతున్నా పోర్టు అధికారులు కనీసం స్పందించడం లేదని.. ఇప్పటికైనా వారు స్పందించి చర్యలు తీసుకోకపోతే.. డ్రెడ్జింగ్ కార్పొరేషన్ భారీ నష్టాల్లో కూరుకుపోతుందని కొందరు ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కోలుకుంటున్నారు..

- విషాహారంతో ఆస్పత్రి పాలైన చిన్నారులు క్షేమం
- అధికారులు అప్రమత్తం కావడంతో మరింత మందికి వైద్యసేవలు




కేజీహెచ్‌లో కోలుకుంటున్న చిన్నారులు

మహారాణిపేట/కోటవురట్ల/నర్సీపట్నం: కోటవురట్ల మండలం కైలాసపట్నం శివారు రాజగోపాలపురంలో ఆహారం కలుషితమై అస్వస్థతకు లోనైన చిన్నారులు వివిధ ఆస్పత్రుల్లో క్రమంగా కోలుకుంటున్నారు. పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) ట్రస్ట్ నిర్వహిస్తున్న ఆశ్రమంలో ఆశ్రయం పొందిన అల్లూరి సీతారామరాజు జిల్లాకు చెందిన గిరిజన బాలల్లో ముగ్గురు నిర్వాహకుల నిర్లక్ష్యం కారణంగా ప్రాణాలు కోల్పోయిన విషయం తెలిసిందే. వాంతులు, విరేచనాలతో బాధ పడుతున్న 35మందికి విశాఖ కేజీహెచ్‌తోపాటు అనకాపల్లి, అల్లూరి జిల్లాల్లోని పలు ఆస్పత్రుల్లో సోమవారం చికిత్స అందించారు. ఈ ఘటనతో అప్రమత్తమైన అధికారులు కలుషిత ఆహారం తిన్న మరింతమంది ఏజెన్సీ బాలలను గుర్తించి మంగళవారం ఆస్పత్రులకు తరలించారు. ప్రస్తుతం విశాఖ కేజీహెచ్‌లో 38మంది, విశాఖ కిమ్స్ ఐకాన్ ఆస్పత్రిలో ఇద్దరు, రెయిన్‌బోలో ఒకరు, నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 22మంది, కోటవురట్ల కమ్యూనిటీ ఆస్పత్రిలో ఐదుగురికి వైద్య సేవలు అందిస్తున్నారు.

విశాఖ కేజీహెచ్‌లో..

పాసా ట్రస్టు ఆశ్రమంలో కలుషిత ఆహారం తిని అస్వస్థతకు గురైన 41 మంది పిల్లలను విశాఖ తీసుకొని వచ్చారు. ఇందులో కేజీహెచ్ పిల్లల వార్డులో 38 మంది చికిత్స పొందుతున్నారు. వీరికి కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.శివానంద్ పర్యవేక్షణలో పిల్లల విభాగాధిపతి డాక్టర్ చక్రవర్తి, ఇతర వైద్యులు సేవలు అందించారు. ఇందులో అయిదుగురి పరిస్థితి కొద్దిగా విషమంగానే ఉంది. పి.జెస్సికా, పి.మౌనికలను కిమ్స్ ఆస్పత్రికి, ఎస్.రవిని రైయిన్ బో ఆస్పత్రికి తరలించారు.

చిన్నారుల ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన ఆర్డీ

నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న 22 మంది గిరిజన విద్యార్థులను, కోటవురట్ల సీహెచ్‌సీలో ఉన్న ఐదుగురిని వైద్య విధాన పరిషత్ రీజనల్ డైరెక్టర్ రామగిద్దయ్య మంగళవారం పరామర్శించారు. విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి గురించి ఆస్పత్రి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. పిల్లల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని జిల్లా అదనపు వైద్యాధికారి డాక్టర్ వీరజ్యోతి ఆర్డీకి వివరించారు. పూర్తిగా కోలుకున్నాక మాత్రమే విద్యార్థులను ఇళ్లకు పంపించాలని ఆర్డీ వైద్యులకు సూచించారు. విద్యార్థులు కోలుకునేందుకు మెరుగైన వైద్యంతోపాటు భోజనం, పండ్లు అందిస్తున్నామని వీరజ్యోతి తెలిపారు. ఆయన వెంట జిల్లా వైద్యాధికారి బాలాజీ, ప్రోగాం ఆఫీసర్ ప్రశాంతి, డాక్టర్ సంతోష్‌కుమార్, ఎంపీహెచ్‌వో గోవిందరావు ఉన్నారు. ఏఎస్ఆర్ జిల్లా గిరిజన సంక్షేమశాఖ అధికారి శిరీష ఆస్పత్రిలో ఉండి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని సమీక్షించారు.

పాసా ట్రస్ట్ సీజ్

విషాహారంతో ముగ్గురు విద్యార్థుల మృతికి కారణమైన పాసా ట్రస్టును అనకాపల్లి కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశాల మేరకు అధికారులు సీజ్ చేశారు. నిర్వాహకుడు, పాస్టర్ కిరణ్‌కుమార్‌పై ఐపీసీ పాత సెక్షన్ 304, భారతీయ న్యాయ సంహిత చట్టం 105 ప్రకారం కేసులు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.


కేజీహెచ్ పిల్లల వార్డులో చికిత్సను పర్యవేక్షిస్తున్న ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శివానంద్

చికిత్స పొందుతున్న బాలల వివరాలు
విశాఖ కేజీహెచ్‌లో 38 మంది
విశాఖ ప్రైవేట్ ఆస్పత్రుల్లో ముగ్గురు
నర్సీపట్నం ఏరియా ఆస్పత్రిలో 22 మంది
కోటవురట్ల కమ్యూనిటీ ఆస్పత్రిలో ఐదుగురు

వరల్డ్ బ్రేక్ డ్యాన్సింగ్ పోటీలకు చైతన్య, ఆర్యన్

సీతంపేట: చైనాలోని వుక్సీ సిటీలో సెప్టెంబరు 28, 29 తేదీల్లో జరగనున్న వరల్డ్ యూత్ బ్రేకింగ్ (బ్రేక్ డ్యాన్సింగ్) చాంపియన్‌షిప్ 2024 పోటీలకు టీమ్ ఇండియా తరపున విశాఖకు చెందిన పెంటకోట చైతన్య, డి.ఆర్యన్ పాల్గొనున్నారు. ఇటీవల చెన్నైలో జరిగిన నేషనల్స్‌లో ప్రతిభ చూపిన వీరిద్దరూ చైనాలో జరగనున్న ప్రపంచ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ చాంపియన్‌షిప్ పోటీలు రానున్న యూత్ ఒలింపిక్స్ గేమ్స్ 2026 క్వాలిఫైయర్ ఈవెంట్‌గా ఉపయోగపడుతుంది. ఈ పోటీ సెనెగల్‌లోని డాకర్‌లో జరుగుతుంది. టీమ్ ఇండియాకు సొహైల్ సింగ్ గిల్ నాయకత్వం వహిస్తాడు. పెంటకోట చైతన్య అక్కయ్యపాలెం నివాసి కాగా, ఆర్యన్ పెదవాల్తేర్‌లో నివసిస్తున్నాడు. వీరిద్దరూ ఎంవీపీ కాలనీలో గల ఏఐఎం ఫిట్‌నెస్ అండ్ డ్యాన్స్ ఫ్లోర్‌లో శిక్షణ పొందుతున్నారు. ఇప్పటికే ఆర్యన్ అండర్ 16 బీబాయ్స్ విభాగంలో జాతీయ కాంస్య పతక విజేత కాగా, చైతన్య అండర్ 16 బీబాయ్స్ విభాగంలో స్టేట్ గోల్డ్ మెడలిస్ట్, ఆల్ ఇండియా బీబాయ్స్‌లో 8వ ర్యాంకుగా గుర్తింపు పొందాడు. చైతన్య 9వ తరగతి చదువుతున్నాడు.

హర్డిలర్ జ్యోతికి ఘన స్వాగతం


జ్యోతికి స్వాగతం పలుకుతున్న అథ్లెటిక్, ఒలింపిక్ సంఘాల ప్రతినిధులు

విశాఖ స్పోర్ట్స్: ఒలింపిక్స్‌లో పాల్గొని మంగళవారం విశాఖకు వచ్చిన స్టార్ హర్డిలర్ జ్యోతికి ఎయిర్‌పోర్టులో ఘన స్వాగతం లభించింది. జిల్లా అథ్లెటిక్ సంఘం ప్రతినిధులతో పాటు ది ఒలింపిక్ సంఘం విశాఖ శాఖ ప్రతినిధులు జ్యోతికి స్వాగతం పలికారు. అభిమానులను జ్యోతి ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒలింపిక్స్‌లో పాల్గొనాలన్నది తన కల అని.. అది తీరిందన్నారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలను సాధించేందుకు ఒలింపిక్స్ ఒక వేదికగా నిలిచిందన్నారు.

24న జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు

మహారాణిపేట: ఉమ్మడి విశాఖ జెడ్పీ స్థాయీ సంఘ సమావేశాలు 24న నిర్వహిస్తున్నట్లు సీఈవో(ఇన్‌చార్జ్) సత్యనారాయణ తెలిపారు. జెడ్పీ చైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఈ సమావేశాలు జరుగుతాయన్నారు.

బ్యాంక్ ఆఫ్ బరోడా శాఖ ప్రారంభం


మద్రిపాలెంలో బీవోబీ శాఖను ప్రారంభిస్తున్న అనూప్ జోయ్, హరి

సీతంపేట: మద్రిపాలెంలో బ్యాంక్ ఆఫ్ బరోడా నూతన శాఖ ప్రారంభమైంది. ఈ శాఖను ఇండియన్ నేవీ సీఎండీఈ అనూప్ జోయ్, కమాండర్ హరి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా బ్యాంకు విశాఖ రీజినల్ హెడ్ పి.ఎం.పదాన్ మాట్లాడుతూ విశాఖ రీజియన్ పరిధిలో ఇది తమ 42వ శాఖ అని, ఖాతాదారులకు నమ్మకమైన సేవలందిస్తూ.. బ్యాంకు దినదినాభివృద్ధి చెందుతోందన్నారు. కార్యక్రమంలో బ్యాంకు డిప్యూటీ రీజినల్ మేనేజర్ సతీషా సాలుంకే, బ్రాంచి మేనేజర్ ఎం.మహేష్, బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఫొటో ఎగ్జిబిషన్


ఫొటోలను వీక్షిస్తున్న మాజీ మంత్రి అమర్‌నాథ్

బీచ్ రోడ్డు: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా బీచ్ రోడ్డులోని మ్యూజియంలో విశాఖ ఫొటో జర్నలిస్ట్ అసోసియేషన్ ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్ సందర్శకులను విశేషంగా ఆకట్టుకుంది. నగరానికి సంబంధించిన ఫొటోగ్రాఫర్లు తీసిన అనేక ఛాయచిత్రాలను ఎగ్జిబిషన్‌లో అందుబాటులో ఉంచారు. మంగళవారం విద్యార్థులు, సందర్శకులు ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఎంపీ భరత్, మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ ఎగ్జిబిషన్‌ను సందర్శించారు.

వరల్డ్ ఆప్తమాలజీ కాన్ఫరెన్స్‌లో 'విజన్ ట్రీ' ఎండీ ప్రసంగం


డబ్ల్యూఓసీలో మాట్లాడుతున్న విజన్ ట్రీ కంటి ఆస్పత్రి ఎండీ డాక్టర్ మధు

మహారాణిపేట: కెనడాలోని వాంకోవర్‌లో జరిగిన వరల్డ్ ఆప్తమాలజీ కాన్ఫరెన్స్(డబ్ల్యూఓసీ)లో భారత్ తరపున విజన్ ట్రీ కంటి ఆస్పత్రి కార్నియల్ ట్రాన్స్‌ప్లాంట్, రిఫ్రాక్టివ్ సర్జన్, మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ మధు ఉద్దరాజు పాల్గొన్నారు. ఈ నెల 14 నుంచి 19 వరకు ఈ సదస్సు జరగ్గా.. వివిధ దేశాల నుంచి సుమారు 10 వేల మంది నేత్ర వైద్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ మధు మాట్లాడుతూ డబ్ల్యూఓసీలో తమ ఆస్పత్రికి మూడు కోర్సు(వైద్య పద్ధతులపై ప్రసంగం, పోస్టర్, వీడియో ప్రదర్శన)ల్లో పాల్గొనే అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. రోగులకు మరింత మెరుగైన వైద్యం అందించేందుకు నూతన విధానాల గురించి తెలుసుకున్నట్లు తెలిపారు.

'స్టీల్' అధికారుల పెర్క్స్ తగ్గింపు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ అధికారులకు పెర్క్స్ తగ్గిస్తూ యాజమాన్యం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. సంస్థ ఎదుర్కొంటున్న క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని బోర్డు లెవెల్ అధికారుల పెర్క్స్ 46 నుంచి 34 శాతంకు అంటే 12 శాతం, బోర్డు స్థాయి కంటే దిగువ అధికారులకు 46 నుంచి 40 శాతం అంటే 6 శాతం తగ్గించినట్లు పేర్కొంది. ఈ తగ్గింపు 2025 మార్చి వరకు అమలులో ఉంటుందని స్పష్టం చేసింది.

డెంగ్యూతో చిన్నారి మృతి


శ్రీసాహితీ (ఫైల్)

అగనంపూడి: డెంగ్యూ జ్వరం చిన్నారిని కబళించింది. సాధారణ జ్వరమే అనుకుని నిర్లక్ష్యం వహించడంతో ముక్కు పచ్చలారని చిన్నారి బలైపోయింది. ఫార్మాసిటీ నిర్వాసిత కాలనీ ఈదుల పాక బోనంగికి చెందిన ములకలపల్లి నూక రామారావు, కళావతి కుమార్తె శ్రీ సాహితీ (8) ఫార్మాసిటీ కాలనీలోని పాఠశాలలో మూడవ తరగతి చదువుతోంది. వారం రోజుల కిందట సాహితీకి జ్వరం రావడంతో ఆమె తల్లిదండ్రులు సాధారణ జ్వరంగా భావించి స్థానికంగా వైద్యమందించారు. జ్వరం తగ్గడం, మళ్లీ వస్తుండడంతో సోమవారం అనకాపల్లిలోని ప్రాంతీయ ఆస్పత్రికి తీసుకువెళ్లారు. అక్కడ పరీక్షించిన వైద్యులు పరిస్థితి విషమంగా ఉండడంతో కేజీహెచ్‌కు రిఫర్ చేశారు. కేజీహెచ్‌లో వైద్య పరీక్షలు నిర్వహించగా డెంగ్యూగా నిర్ధారణ అయింది. అయితే అప్పటికే పరిస్థితి విషమించడంతో మంగళవారం తెల్లవారుజామున చిన్నారి మరణించింది. అల్లారు ముద్దుగా పెరిగిన చిన్నారి కళ్లముందే మృత్యువాత పడడంతో ఆమె తల్లిదండ్రులు, బంధువులు కన్నీరుమున్నీరయ్యారు. బాలిక మృతితో గ్రామంలో విషాదం నెలకొంది.

• అల్లకల్లోలం

ఆర్.కె.బీచ్‌లో మంగళవారం అలలు ఎగిసి పడ్డాయి. ఆటుపోట్ల కారణంగా 10 నుంచి 15 మీటర్ల మేర సముద్రం ముందుకొచ్చింది. కెరటాలు రక్షణ గోడలను తాకాయి. వైఎంసీఏ నుంచి కోస్టల్ బ్యాటరీ వరకు ఈ పరిస్థితి కనిపించింది. దీంతో కొన్ని ప్రాంతాల్లో పర్యాటకులు ఇసుక తిన్నెలు మీదకు వెళ్లడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. మరో వైపు లైఫ్‌గార్డ్స్ పర్యాటకులను అప్రమత్తం చేశారు.

ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



బాధిత కుటుంబాలను ఆదుకోవాలి

అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి


సూపరింటెండెంట్ శివానంద్‌తో మాట్లాడుతున్న మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ నేత బాలరాజు

మహారాణిపేట: కైలాసపట్నంలోని అనధికార పరిశుద్ధాత్మ అగ్ని స్తుతి ఆరాధన (పాసా) ఆశ్రమంలో అస్వస్థతకు గురై కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను అరకు ఎంపీ డాక్టర్ గుమ్మా తనూజారాణి మంగళవారం పరామర్శించారు. పిల్లల ఆరోగ్య పరిస్థితిని ఆస్పత్రి వర్గాలకు అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అనంతరం పాడేరు ఐటీడీఏ పీవో, అల్లూరి కలెక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడారు. ఈ దుర్ఘటనకు సంబంధించి కాల్ సెంటర్ ఏర్పాటు చేసి పిల్లల తల్లిదండ్రులకు ధైర్యం చెప్పాలన్నారు. ఇళ్లకు వెళ్లిన విద్యార్థులకు అంబులెన్స్ ఏర్పాటు చేసి ఆస్పత్రుల్లో వైద్యం అందించే చర్యలు తీసుకోవాలన్నారు. ఐటీడీఏ పరిధిలోని ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించి విద్య అభ్యసించే అవకాశం కల్పించాలని, బాధిత కుటుంబాలను ఆదుకోవాలన్నారు.


కేజీహెచ్‌లో పిల్లలను పరామర్శిస్తున్న అరకు ఎంపీ డాక్టర్ తనూజారాణి

పలువురి పరామర్శ

కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి వి.అభిషేక్, మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి పసుపులేటి బాలరాజు, రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం, కాంగ్రెస్ ఓబీసీ చైర్మన్ మూల వెంకటరావు, ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ జయదేవి, జిల్లా చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్‌పర్సన్ ఎం.ఆర్.ఎల్.రాధ, సభ్యులు లక్ష్మి, ఎం.రజని, సూర్యనారాయణ, విజయలక్ష్మి, సీడీపీవో శ్రీలత, జిల్లా బాలల సంరక్షణాధికారి లక్ష్మి, పీవో ఐసీ రమేష్, కేజీహెచ్ వన్‌స్టాప్ సెంటర్ ప్రతినిధి శరణ్య తదితరులు పరామర్శించారు.

సమస్యల పరిష్కారంలో ముందంజ

ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

తాటిచెట్లపాలెం: ఆలిండియా బీఎస్ఎన్ఎల్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌ను 2009 ఆగస్టు 20న ప్రారంభించామని, నాటి నుంచి పెన్షనర్లకు సంబంధించి అనేక సమస్యలు పరిష్కరించామని అసోసియేషన్ ఏపీ సర్కిల్ ప్రధాన కార్యదర్శి డి.వెంకటేశ్వరరావు తెలిపారు. రైల్వే న్యూకాలనీ సమీపంలోని సుబ్బలక్ష్మి కల్యాణ మండపంలో మంగళవారం అసోసియేషన్ ఉమ్మడి విశాఖ జిల్లా సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు లక్ష మంది సభ్యులతో టెలికం రంగంలో నంబర్ వన్ యూనియన్‌గా అవతరించి.. నీతి ఆయోగ్ ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. అసోసియేషన్ ఆలిండియా నాయకుడు ఆర్.ఎస్.ఎన్.మూర్తి మాట్లాడుతూ 7వ వేతన సంఘ సిఫార్సుల అమలు విషయమై ఢిల్లీ హైకోర్టులో వాదప్రతివాదనలు జరుగుతున్నాయని, త్వరలోనే పెన్షనర్లకు అనుకూలమైన తీర్పు వస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. బీఎస్ఎన్ఎల్‌కు ఉద్దీపన ప్యాకేజీ పేరుతో చేస్తున్న ప్రచారంతో ఒరిగిందేమి లేదని, ఇది కేవలం కాగితాలకే పరిమితమని ఇతర వక్తలు అన్నారు. సంస్థ 15వ వార్షికోత్సవం పురస్కరించుకుని 75 ఏళ్లు నిండిన పెన్షనర్లకు ఘనంగా సన్మానించారు. సమావేశంలో అసోసియేషన్ ఆలిండియా ఉపాధ్యక్షుడు ఎం.ఆర్.పట్నాయక్, జిల్లా అధ్యక్షుడు కె.చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి కె.సోమసుందరరావు, కె.వి.డి.స్వామి, వి.ఆర్.కె.శర్మ, శ్రీమన్నారాయణ, పి.బాబూరావు తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అసోసియేషన్ ఏపీ సర్కిల్ ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరరావు

మినిమం పెన్షన్ రూ.9 వేలకు పెంచాలి

విశాఖ విద్య: సమస్యలు పరిష్కరించాలంటూ ఏపీ ఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ సభ్యులు మద్రిపాలెం వుడా లేఅవుట్‌లోని ప్రాంతీయ పీఎఫ్ కార్యాలయం వద్ద మంగళవారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రీజినల్ అధ్యక్షుడు బొడ్డేటి జగత్‌రావు, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ పైడిరాజు మాట్లాడుతూ సుప్రీంకోర్టు 2022లో ఇచ్చిన తీర్పును అమలుపరచకుండా ఈపీఎఫ్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం సైతం చోద్యం చూస్తుండటం దారుణమన్నారు. రిటైర్డ్ ఎంప్లాయీస్‌కు మినిమం పెన్షన్ రూ.9 వేలకు పెంచాలని, డీఏ, వైద్య సౌకర్యాలు కల్పించాలన్నారు. 2014 జనవరి ఒకటి తర్వాత ఉద్యోగ విరమణ చేసిన వారు హాయ్యర్ పెన్షన్ కోసం డబ్బులు చెల్లించారని, వారికి వెంటనే ఆ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగుల భవిష్య నిధి కార్యాలయం అధికారికి తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ రీజినల్ సెక్రటరీ వెంకట్రావు, రాష్ట్ర కార్యదర్శి సిహెచ్.పైడిరాజు, రీజినల్ వర్కింగ్ అధ్యక్షుడు పి.శ్రీధర్, రీజినల్ కోశాధికారి జగ్గారావు, రీజినల్ ప్రచార కార్యదర్శి బి.ఏ.స్వామి, రాష్ట్ర వర్కింగ్ అధ్యక్షుడు బీవీకే రాయ్, ఎం.వి సుబ్రహ్మణ్యం, అధిక సంఖ్యలో ఏపీఎస్ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయీస్ పాల్గొన్నారు.


పీఎఫ్ కార్యాలయ అధికారికి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు